క్లుప్తంగా

సక్రమంగా నీరు సరఫరా చేయాలి



ఎస్సీ కమ్యూనిటీ హాల్ దగ్గర కుళాయిల వద్ద నీరు పట్టుకుంటున్న ప్రజలు

కల్లూరు: మండల పరిధిలోని బస్తిపాడులో ప్రతి కాలనీకి నీరు సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో జల్ జీవన్ మిషన్ పథకం కింద గ్రామంలో ఇంటింటికీ కొళాయి కనెక్షన్ ఇచ్చారు. నీరు సరఫరా చేస్తున్న పైప్‌లైన్ కొన్ని చోట్ల లీకేజీ వల్ల ఇంటింటికీ నీరు అందడం లేదు. దీంతో కాలనీవాసులు ఎస్సీ కమ్యూనిటీ హాల్ దగ్గర ఏర్పాటు చేసిన కొళాయిల వద్దకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారు. లీకేజీ సమస్యను పరిష్కరిస్తే అందరి ఇళ్లకు నీరందుతుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి పైప్‌లైన్ లీకేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

కుట్టు మిషన్ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

సి.బెళగల్: మండలంలో 18 ఏళ్ల నుంచి 50 ఏళ్ల మధ్య గల మహిళలు కుట్టు మిషన్ శిక్షణ, కుట్టు మిషన్ల మంజూరుకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ రాణెమ్మ మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, వైశ్య, బ్రాహ్మణ, కాపు కులాలకు చెందిన మహిళలకు టైలరింగ్ శిక్షణతో పాటు కుట్టు మిషన్లు అందజేయడం జరుగుతుందన్నారు. తెల్ల రేషన్‌కార్డు ఉన్న మహిళలు ఇందుకు అర్హులన్నారు. ఆసక్తి గల వారు గ్రామ సచివాలయాల్లోని సంక్షేమ సహాయకుల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు మండల అధికారుల సమావేశం

సి.బెళగల్: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వివిధ శాఖల మండల అధికారులు, పంచాయతీల కార్యదర్శులతో సమావేశ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాణెమ్మ తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈసమావేశం మండల ప్రత్యేకాధికారి అధ్యక్షతన జరుగుతుందన్నారు. శాఖల వారీగా సమీక్షలు నిర్వహించి గ్రామాల్లో వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మంచినీటి ఎద్దడి నివారణ చర్యలపై చర్చించడం జరుగుతుందన్నారు. మండల అధికారులతో పాటు అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తప్పక హాజరవ్వాలని ఆమె కోరారు.

కొనసాగుతున్న ఎన్‌ఎస్‌ఎస్ క్యాంప్

కల్లూరు: మండలంలోని సల్కాపురం గ్రామంలో ప్రభుత్వ నర్సింగ్ విద్యార్థినుల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక క్యాంపు కొనసాగుతోంది. మంగళవారం కళాశాల అధ్యాపకురాలు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అన్నపూర్ణ పర్యవేక్షణలో విద్యార్థినులు జిబి సిండ్రోమ్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే బీపీ వల్ల వచ్చే సమస్యలు, వాటిని ఎలా నివారించాలో తెలియజేశారు.

నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలి

కోడుమూరు రూరల్: ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను మార్చి నెలాఖరులోగా పూర్తి చేయాలని ఎంపీడీఓ రాముడు సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో ఎంపీడీఓ రాముడు, ఏపీఓ మోదీన్‌బాషా టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ నెలాఖరుకు ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున ఉపాధి హామీ పథకం కింద మంజూరైన పనులు, ఫారంపండ్లు, మినీ గోకులాల నిర్మాణాలన్నింటినీ త్వరగా పూర్తి చేయాలన్నారు. అలాగే ప్రతి కుటుంబానికి ఉపాధి హామీ పథకం కింద వంద రోజుల పనిదినాలు కల్పించాలని, నిర్ణయించిన కొలతల ప్రకారం కూలీల చేత పనులు చేయిస్తే రోజు వారి వేతనం రూ.300 పడుతుందన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో పనులు అవసరమైన కూలీలందరికి పనులు కల్పించడంతో పాటు పనులు చేసే ప్రదేశాల్లో వసతి సౌకర్యాలు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు.

ఆయకట్టుకు సాగునీరు విడుదల



గాజులదిన్నె ప్రాజెక్టు ఎడమ కాల్వ ద్వారా వదిలిన నీరు

కోడుమూరు రూరల్: గాజులదిన్నె ప్రాజెక్టు ఎడమ కాల్వ కింద సాగు చేసిన ఆయకట్టుకు నీటి తడులు కట్టుకునేందుకు మంగళవారం సాయంత్రం నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఈ నారాయణ మాట్లాడుతూ ఎడమ కాల్వ కింద రైతులు సాగు చేసిన మొక్కజొన్న, కొర్ర తదితర పంటలకు నీటి తడులు కట్టుకునేందుకు ఎడమ కాల్వకు 40 క్యూసెక్కుల నీరు విడుదల చేశామన్నారు. రైతులు నీటిని వృథా చేయకుండా పొలాలకు కట్టుకోవాలని సూచించారు.

'గోరుకల్లు' నిర్వహణ అస్తవ్యస్తం



బండ్‌పై అసంపూర్తిగా పనులు


- అరకొర నిధులు కేటాయించిన కూటమి సర్కారు
- జలాశయంలో ఎక్కడ చూసినా కంపచెట్లు, బండ్‌పై లోతైన గోతులు



ఇన్‌ఫ్లో రెగ్యులేటర్ వద్ద పెరిగిపోయిన కంపచెట్లు

పాణ్యం: రాష్ట్ర ప్రభుత్వం అరకొర నిధులు కేటాయించడంతో గోరుకల్లు జలాశయ నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. జలాశయంలో ఎక్కడ చూసినా కంపచెట్లు, బండ్‌పై లోతైన గోతులు పడ్డాయి. ప్రధానంగా జంగిల్ క్లియరెన్స్, గ్యాలరీలో పనులు, బండ్‌పై గోతులు పూడ్చడం, గట్లకు మరమ్మతులు, గేట్లకు సంబధించి సాంకేతిక పనులు చేయాల్సి ఉంది. జలాశయ కట్ట బండ్‌కు సంబంధించి రివ్యూట్‌మెంట్ జారి పోవడంతో గత ప్రభుత్వం యుద్ధప్రాదిపదికన కోటి రూపాయలతో పనులు చేయించింది. నీటినిల్వకు ఇబ్బంది లేకుండా చేసింది. అయితే కూటమి ప్రభుత్వం రాయలసీమకు తలమానికంగా ఉన్న గోరుకల్లు జలాశయానికి ఆరకొర నిధులు కేటాయించడంతో నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. ఈ విషయంపై గోరుకల్లు జలాశయ ఈఈ సుభకుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం రూ. 65లక్షల నిధులు కేటాయించిందన్నారు. ఈ నిధులతో గ్యాలరీలో కొంత మేర జంగిల్ క్లియరెన్స్, గేట్లుకు మరమ్మతులు, ఇతర పనులు చేయాల్సి ఉందని చెప్పారు.

వైఎస్సార్ విగ్రహానికి నిప్పు



దుండగులు నిప్పు పెట్టడంతో కాలిన వైఎస్సార్ విగ్రహ తల పైభాగం





ఎస్‌ఐకి ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కోడుమూరు రూరల్: కోడుమూరులో మాజీ ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి మంగళవారం గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టారు. విగ్రహం పైభాగాన పెట్రోల్ పోసి నిప్పటించడంతో విగ్రహం పూర్తిగా దెబ్బతినింది. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ప్రభాకర్, కోడుమూరు మండల అధ్యక్షుడు రమేష్‌నాయుడు, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి స్థానిక నాయకులతో కలిసి న వైఎస్సార్ విగ్రహాన్ని పరిశీలించి నిరసన తెలిపారు. ఘటనపై కోడుమూరు ఎస్ఐ శ్రీనివాసులుకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ ఘటనా స్థలికి చేరుకొని విగ్రహాన్ని పరిశీలించారు. సమీపంలోని పెట్రోల్ బంకులో సీసీ టీవీ పుటేజీని పరిశీలించి విచారణ చేపట్టారు.

సమావేశాలు రెగ్యులర్‌గా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం రామేశ్వర్

సి.బెళగల్: గ్రామాల్లో పొదుపు సంఘాల సమావేశాలను ప్రతి నెల నిర్వహించాలని వెలుగు ఏపీఎం రామేశ్వర్ అన్నారు. మంగళవారం స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో మండల మహిళా సమైక్య సంఘాలు (ఎంఎంఎస్) సమావేశం నిర్వహించారు. ఎంఎంఎస్ అధ్యక్షురాలు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గ్రామాల వారీగా జరిగే జీఎఎస్ సమావేశ తేదీలపై చర్చించారు. అనంతరం పొదుపు నిధులు వినియోగం, నగదు జమలు, బ్యాంక్ రుణాల గురించి వివరించారు. కార్యక్రమంలో సీసీ శ్రీనివాసులు, రాముడు, గుండమయ్య, మహబూబ్‌బాషా, మాదుల, ఎంఎస్ అకౌంటెంట్ గోవిందు, తదితరులు ఉన్నారు.

క్షేమంగా.. రావమ్మా!



కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

కర్నూలు(సెంట్రల్): అంతరిక్ష కేంద్రం నుంచి నాసా హ్యోమగామి సునీతా విలియమ్స్ క్షేమంగా తిరిగి రావాలని కోరుకుంటూ నగరానికి చెందిన మాంటిస్సోరి విద్యార్థులు ఆకాంక్షించారు. ఈ మేరకు మంగళవారం ఉదయం కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట వారు ప్రార్థనలు చేశారు. బుధవారం ఆమె భూమికిపైకి తిరిగి వస్తుండగా ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడాలని దేవుడిని ప్రార్థించారు. ఆమెతోపాటు ఉన్న వారంతా క్షేమంగా చేరుకోవాలని కోరుకున్నారు.

మూల పెద్దమ్మకు విశేష పూజలు



అమ్మవారికి వెండి త్రిశూలాన్ని బహూకరిస్తున్న దాతలు

గడివేముల: మండల కేంద్రం గడివేములలో వెలసిన మూలపెద్దకు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి కుంకుమార్చన, ఆకుపూజ చేశారు. భక్తులకు వాల్మీకి సేవా సమితి ఆధ్వర్యంలో భోజన సౌకర్యం కల్పించారు.

అమ్మవారికి త్రిశూలం బహూకరణ

మూలపెద్దమ్మకు గడివేములకు చెందిన నాగన్న, భూలక్ష్మి దంపతులు రూ.70 వేలు విలువ చేసే వెండి త్రిశూలం బహూకరించారు. దాత కుటుంబానికి ఈఓ రామలింగారెడ్డి అమ్మవారి తీర్థప్రసాదాలు అందించారు. మిద్తూరు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దేవమడ జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా భూ రీసర్వే



రీ సర్వే పనుల వివరాలపై ఆరా తీస్తున్న జిల్లా సర్వే అధికారులు

సి.బెళగల్: మండలంలో భూ రీ సర్వే పకడ్బందీగా చేపట్టాలని జిల్లా సర్వే అధికారి (ఏడీ) మునికన్నన్ అన్నారు. మంగళవారం ఆయన డీఐఎస్ సుబ్బారెడ్డి, టీఎఫ్‌డీఐ విజయకుమారి తదితరులతో కలిసి సి.బెళగల్లో జరుగుతున్న సర్వే పనులను పరిశీలించారు. అనంతరం వారు స్థానిక రైతు సేవా కేంద్రంలో మండల అధికారులతో సర్వే పనులపై సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. రైతుల సమక్షంలో భూముల కొలతలు తీసుకోవాలని, పొరపాట్లకు తావులేకుండా సర్వే నివేదికలు నమోదు చేయాలన్నారు. అలాగే సర్వేపై రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు. సమీక్షలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, మండల సర్వేయర్ నాగభూషణం, వీఆర్వోలు, సర్వే సహాయకులు ఉన్నారు.

నీటి వనరుల గణనపై శిక్షణ

సి.బెళగల్: మండలంలో చేపట్టే చిన్న తరహా నీటి వనరుల గణనపై ఏఎస్ఓ ఆదినారాయణ వీఆర్వోలకు శిక్షణ ఇచ్చారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏఎస్ఓ మాట్లాడుతూ వీఆర్వోలు మండలంలో 7వ చిన్న తరహా నీటి వనరుల గణన చేపట్టాల్సి ఉంటుందన్నారు. బావులు, బోర్లు, ఉపరిత ఎత్తిపోతల పథకాలు, వాటర్‌బాడీ వనరుల వివరాలను పకడ్బందీగా గణన యాప్‌లో నమోదు చేయాలని సూచించారు.

అరబిక్ పాఠశాలను 'కార్పొరేట్'కు అప్పగించొద్దు

కర్నూలు కల్చరల్: వందేళ్ల చరిత్ర ఉన్న ఉమర్ అరబిక్ ఉన్నత పాఠశాలను కార్పొరేట్ విద్యా సంస్థకు అప్పగించాలని చూడటం తగదని ఉమర్ అరబిక్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు రిజ్వాన్, డాక్టర్ హమీదీ, ముస్లిం మైనార్టీ ఆర్గనైజేషన్ (సలీమ్ అలీ ఖాన్, షేక్ ఇమ్రాన్, ముస్తాక్, యాసర్) అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు మాట్లాడారు. అంజుమన్ కమిటీ, వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఈ పాఠశాలను ఓ ప్రైవేట్ పాఠశాలకు అప్పగించడాన్ని అడ్డుకుంటామన్నారు. పేద బడుగు బలహీన వర్గాల మైనార్టీ పిల్లలు చదువుకు అంజుమన్ కమిటీ అడ్డుపడటం అన్యాయమన్నారు. సమావేశంలో ఆవాజ్ కమిటీ ఇక్బాల్, షరీఫ్, మాసుమ్, షోయబ్, ఆమేర్, బీడబ్ల్యు రాజు, ఎన్ఎస్‌యూ మహేష్, ఏఐఐటీఏ చాంద్ బాషా, ఎస్ఎఫ్ఐ ఉదయ్, అబూబకర్, పృథ్వీ, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు ఝాన్సీ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టండి

- 'నో హెల్మెట్ – నో ఎంట్రీ' బ్యానర్లు ఏర్పాటు చేయండి
- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు (సెంట్రల్): రహదారి ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో డిస్ట్రిక్ట్ రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడం, వాహనాలను ఓవర్‌టేక్ చేయడం, హెల్మెట్ ధరించకపోవడం వంటి కారణాలతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. రహదారి నియమాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని, వాహనదారులు హెల్మెట్ ధరించేలా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ముందుగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల పరిసరాల్లో తప్పనిసరిగా హెల్మెట్ వాడేలా 'నో హెల్మెట్ - నో ఎంట్రీ' అనే బ్యానర్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

- ఎల్లమ్మ తల్లి గుడి దగ్గర బ్రిడ్జి వర్క్ పూర్తి చేశారని, బ్రిడ్జి అప్రోచ్ రోడ్డుకు సంబంధించి నేషనల్ హైవే అధికారులతో సమీక్ష నిర్వహించుకుని త్వరితగతిన భూసేకరణను పూర్తి చేయాలని కలెక్టర్ కర్నూలు ఆర్‌డీఓను ఆదేశించారు.
- కిడ్స్ వరల్డ్ నుంచి రాజ్‌విహార్ సర్కిల్ వరకు ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను వచ్చే సమావేశం నాటికి సమర్పించాలని కలెక్టర్ కర్నూలు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌ను ఆదేశించారు.
- పెద్దపాడు నుంచి హైదరాబాద్‌కు ఎన్‌హెచ్‌కు లింక్ చేస్తూ ఔటర్ రింగ్ రోడ్ ఏర్పాటుకు సంబంధించి ఎన్‌హెచ్, ఆర్అండ్‌బీ, మున్సిపల్ శాఖల అధికారుల సంయుక్త పరిశీలన నివేదిక అందజేయాలన్నారు.

వ్యవసాయ పనిముట్లకు సబ్సిడీ మంజూరు



దుర్వేశిలో పొలంబడి నిర్వహిస్తున్న ఏఓ

గడివేముల: రైతులు ఉపయోగించే వివిధ రకాల పనిముట్ల కోసం రూ.9 లక్షల సబ్సిడీ మండలానికి మంజూరైందని ఏఓ హేమసుందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని దుర్వేశి, కొరటమద్ది గ్రామాల్లోని వరి పంటలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. సొంత పొలం ఉన్న ప్రతి రైతు విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలని సూచించారు. రైతులు ట్రాక్టర్ పనిముట్లు, తైవాన్ స్ప్రేయర్లు, బ్యాటరీ స్ప్రేయర్లు సబ్సిడీపై తీసుకునేందుకు ఆయా రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు.

యాంత్రీకరణకు ముందుకు రావాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: రైతులు వ్యవసాయ యాంత్రీకరణకు ముందుకు రావాలని మండల వ్యవసాయ అధికారి మల్లేష్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రం సి.బెళగల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు పంటల సాగు, వ్యవసాయ యాంత్రీకరణపై అవగాహన కల్పించారు. అనంతరం మండల వ్యవసాయ కార్యాలయంలో రైతులతో ఆయన మాట్లాడుతూ సబ్సిడీ ద్వారా రైతులు యంత్రాలు పొందాలని, వ్యవసాయంలో యాంత్రీకరణతో తక్కువ సమయంలో ఎక్కువ పనులు సులభంగా చేసుకోవచ్చని చెప్పారు. అదేవిధంగా అధిక దిగుబడులను సైతం సాధించవచ్చని ఏఓ తెలియజేశారు. కార్యక్రమంలో ఏఈఓ హిమబిందు, వీఏఏ ఆసీఫ్, ఎంపీఈఓలు వెంకటేష్, సునంద తదితరులు ఉన్నారు.

రోడ్డు పనులు ప్రారంభించాలని రాస్తారోకో



గార్గేయపురం వద్ద రాస్తారోకో నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

ఓర్వకల్లు/కర్నూలు (రూరల్): మండలంలోని కేతవరం గ్రామం నుంచి గార్గేయపురం వరకు అర్ధాంతరంగా నిలిచిపోయిన రోడ్డు నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రామకృష్ణ డిమాండ్ చేశారు. రోడ్డు నిర్మాణం విషయంలో అధికారుల నిర్లక్ష్యానికి నిరసనగా కేతవరం నుంచి గార్గేయపురం వరకు పాదయాత్ర చేపట్టారు. అనంతరం కర్నూలు, నందికొట్కూరు రోడ్డుపై అరగంట రాస్తారోకో చేశారు. వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. గార్గేయపురం నుంచి కేతవరం మీదుగా పూడిచెర్ల జాతీయ రహదారి వరకు నిర్మించిన రోడ్డుపై జైరాజ్ ఇస్పాత్ కంపెనీకి చెందిన భారీ వాహనాల తాకిడికి అస్తవ్యస్తంగా మారి, మోకాటి ఎత్తు గుంతలు ఏర్పడడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బంధులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటు కర్నూలు-విజయవాడ, అటు కర్నూలు-కడప జాతీయ రహదారులకు నిత్యం అనేక మంది బైక్‌లు, ఆటోలు, ఇతర వాహనాల్లో ప్రయాణిస్తుంటారని తెలిపారు. అలాగే కేతవరం సమీపంలో ఆదిమానవులు సంచరించిన ప్రాంతం ఉండడంతో పర్యాటకులు వస్తుంటారన్నారు. ఇంతటి కీలకమైన రోడ్డును నిలిపివేయడంపై అంతర్యమేమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికార పార్టీ నేతలు స్పందించి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించాలని కోరారు. సీపీఎం నాయకులు నాగన్న, శ్రీధర్, రంగస్వామి, వెంకటస్వామి, తెలుగు నాగమ్మ, సుబ్బరాయుడు, నరేష్, మద్దిలేటి, మధు, భరత్, శ్రీరాములు పాల్గొన్నారు.





ప్రత్యేక అలంకరణలో ఎల్లమ్మ అమ్మవారు, ఆలయం వద్ద భక్తుల రద్దీ

భక్తజన సందడి

కర్నూలు(రూరల్): వెంకాయపల్లె ఎల్లమ్మకు మంగళవారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచి అమ్మవారికి కుంకుమార్చన, ఆకుపూజ నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

సాంకేతికత అందిపుచ్చుకుంటేనే అవకాశాలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం

పాణ్యం: విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం అన్నారు. మంగళవారం కళాశాలలో క్యాంపస్ రెడినెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్యాంట్ రీజనింగ్ అండ్ కమ్యూనికేషన్ స్కిల్స్ అనే అంశంపై విద్యార్థులకు వివరించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో సాంకేతిక అందిపుచ్చుకుంటేనే అవకాశాలు వస్తాయని తెలిపారు. విద్యార్థులు ఇలాంటి సదస్సుల్లో పాల్గొని టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

సూపర్‌సిక్స్ పథకాలు వెంటనే అమలు చేయాలి



బుధవారపేటలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): సూపర్ సిక్స్ పథకాలను సీఎం చంద్రబాబు నాయుడు వెంటనే అమలు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం23వ వార్డు శ్రీరామ్‌నగర్‌లో సీపీఎం నగర కార్యదర్శి ఆర్.నరసింహులు,, నాయకులు ఎస్. అజ్మత్, జాన్సన్, విజయభాస్కర్, రహిమాన్ ఆధ్వర్యంలో, బుధవారపేటలోని 14, 15, 16 వార్డుల పరిధిలో ఓల్డ్‌సిటీ నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్, నాయకులు ఎస్ఎండీ షరీఫ్, అబ్దుల్‌దేశాయ్, కె.రామకృష్ణ ప్రజా చైతన్య యాత్రలో పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఆయా వార్డుల్లో శిథిలమైన రోడ్లను బాగుచేయాలని, మురుగునీటి కాలువలను శుభ్రంచేయాలని డిమాండ్ చేశారు. శివారు కాలనీలకు మంచినీరు సరఫరా కావడంలేదన్నారు. డ్రెయినేజీలు పాడవడంతో రోడ్లపైనే మురుగునీరు పారుతోందన్నారు.

రుణాలను రెన్యువల్ చేసుకోండి



మాట్లాడుతున్న సీఈఓ ఆదినారాయణ

గడివేముల: మండల కేంద్రం గడివేముల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో తీసుకున్న రుణాలను ఈ నెల 25వ తేదీలోగా వడ్డీ చెల్లించి రెన్యువల్ చేసుకోవాలని సీఈఓ ఆదినారాయణ మంగళవారం తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. సంఘంలో రైతునేస్తం, రైతు మిత్ర రుణాలను సమయానికి చెల్లిస్తే వడ్డీ తక్కువగా పడుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైభవంగా లక్ష్మీమాధవుడి గజోత్సవం



అశేష భక్తజనం మధ్య శ్రీలక్ష్మీ మాధవుల గజోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కోడుమూరు రూరల్: మండలంలోని గోరంట్ల గ్రామంలో శ్రీలక్ష్మీమాధవస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి అమ్మవార్ల గజోత్సవం నిర్వహించారు. ఉత్సవమూర్తులైన స్వామి అమ్మవార్లను గజవాహనంపై ఆశీనులు చేసి డప్పుచప్పుళ్లు, మేళతాళాల మధ్య గ్రామ పుర వీధుల గుండా ఊరేగించారు. గజవాహనానికి ముందు గోరంట్ల వాసులు, వెనుక ఎర్రగుడి వాసులు నిలబడి పోటా పోటీగా స్వామి వారి గజోత్సవ కార్యక్రమాన్ని కోలాహలంగా నిర్వహించారు.

గజోత్సవంలో అపశ్రుతి

స్వామివారి గజోత్సవం నిర్వహిస్తున్న సమయంలో అపశ్రుతి చోటు చేసుకుంది. గజోత్సవ వాహనానికి సంబంధించిన కాడుమాకు బందోబస్తు నిర్వహిస్తున్న కోడుమూరు కానిస్టేబుల్ పరమేష్ కడుపుపైభాగాన తగలడంతో గాయపడ్డాడు. దీంతో కోడుమూరు ఎస్ఐ శ్రీనివాసులు కానిస్టేబుల్‌ను చికిత్స నిమిత్తం హుటాహుటానికి పెంచికలపాడులోని విశ్వభారతి హాస్పిటల్‌కు తరలించారు. కానిస్టేబుల్ కోలుకుంటున్నట్లు పోలీస్ సిబ్బంది తెలిపారు.

జాతరలో మద్యం విక్రయిస్తే చర్యలు

గోరంట్ల జాతరలో ఎవ్వరైనా వ్యక్తులు మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని కోడుమూరు ఎక్సైజ్ సీఐ మంజుల మంగళవారం హెచ్చరించారు. జాతరలో మద్యం విక్రయించేందుకు ఎవ్వరికి అనుమతులు ఇవ్వలేదన్నారు. నిబంధనలను అతిక్రమించి గ్రామంలో ఎవరైనా మద్యం విక్రయిస్తే తమకు సమాచారం ఇవ్వాలని సీఐ ప్రజలకు సూచించారు.